క్లుప్తంగా

ఈ-శ్రమ్ కార్డు లబ్ధిదారుల పేర్లు నమోదు



పేర్లు నమోదు చేయిస్తున్న సర్పంచ్ యాదగిరి, ట్రస్ట్ సభ్యులు

ఘట్‌కేసర్: మాదారంలో వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ-శ్రమ్ కార్డు, ఆయుష్మాన్ భారత్ లబ్ధిదారుల పేర్లు బుధవారం నమోదు చేయించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ.. వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ-శ్రమ్, ఆయుష్మాన్ భారత్ కార్డుల పేర్లు నమోదు, లామినేషన్, సర్వీస్ చార్జీలు చెల్లిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి, ట్రస్ట్ సభ్యులు గణేశ్, ప్రేమ్‌కుమార్, మధు, స్థానికులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



ఘట్‌కేసర్‌లో కంటి వెలుగును పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: కంటి సమస్యలున్న వారు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని పదమూడో వార్డులో కౌన్సిలర్ జహంగీర్‌తో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ విమలరెడ్డి, అప్తమాలజిస్ట్ శిరీష, డీఈఓ సాత్విక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్..


వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: భార్యతో గొడవపడిన వ్యక్తి మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో దీపక్(28) కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. గత వారం రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరగగా మనస్తాపం చెందిన దీపక్ బుధవారం భార్య ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

పన్నుల వసూలుపై ఫోకస్

పురపాలికల్లో పన్నులు చెల్లించని పాత బకాయిదారులకు హెచ్చరికలు జారీ

- చెల్లించని ఇళ్లు, అపార్ట్‌మెంట్ల డ్రైనేజీని మూయించేందుకు చర్యలు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పన్నుల రాబడి టార్గెట్ రూ.211.63 కోట్లు
- 13 పురపాలికలు, 61 గ్రామ పంచాయతీల్లో కలిపి ఇప్పటి వరకు రాబడి రూ.148 కోట్లు
- 14 రోజుల్లో మిగిలిన రూ.63.63 కోట్ల వసూలుపై ప్రత్యేక చర్యలు
- ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో.. రోజు వారీ కార్యాచరణతో మానిటరింగ్



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో స్థానిక సంస్థ(పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు)ల్లో పన్నుల వసూళ్లు 2022-23 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి అనుగుణంగా చేరుకొనకపోవటంతో.. బలవంతపు వసూళ్లపై సిబ్బంది దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా జిల్లాలోని పలు పురపాలక సంఘాల్లో ఏడాది.. అంతకంటే ఎక్కువ (మించిన) బకాయిలు చెల్లించకుండా.. పెండింగ్‌లో ఉన్నట్లయితే ఆ ఇంటి యజమాని లేదా అపార్టుమెంట్ డ్రైనేజీలను మూసివేస్తామని హెచ్చరికలు జారీ చేశాయి. అపార్టుమెంట్లలో ఒకరిద్దరు పాత బకాయిలు చెల్లించకపోయినా.. అపార్టుమెంట్‌కు సంబంధించిన డ్రైనేజీని మూసి వేస్తున్నారు. అభివృద్ధిలో ముందు భాగాన నిలుస్తోన్న పలు పురపాలక సంఘాలు ఈ చర్యలకు పూనుకున్నట్లు తెలుస్తోంది. పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో పాత బకాయిలు వేలల్లో పెండింగ్‌లో ఉన్న వారి ఇళ్లు, అపార్టుమెంట్ల డ్రైనేజీలను మూసివేసి.. చెల్లించిన వెంటనే మళ్లీ ఆ డ్రైనేజీలను తెరిచిన ఘటనలు ఉన్నాయి. ఈ విధానాన్ని ఇక్కడ పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే జిల్లాలోని ఐదారు పురపాలక సంఘాల్లో ఈ కఠిన చర్యలను అమలు చేస్తున్నారు.

టార్గెట్ రూ.211.63 కోట్లు.. వసూలైంది రూ.148 కోట్లు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో స్థానిక సంస్థల్లో 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను పన్నుల వసూళ్ల టార్గెట్ రూ.211.63 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.148 కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా రావలసి పన్నుల రాబడి రూ.63.63 కోట్లు ఈ నెలాఖరు కల్లా వసూలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో రోజు వారీగా పన్నుల వసూళ్లపై టార్గె ట్ విధించి తగిన కార్యాచరణతో సంబంధిత అధికారు లు నిత్యం మానిటరింగ్ చేయడం ద్వారా లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పురపాలక సంఘాల్లో లక్ష్యం రూ.188.55 కోట్లు..

రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నాలుగు కార్పొరేషన్లు, తొమ్మిది మున్సిపాలిటీల చొప్పున మొత్తం 13 పురపాలక సంఘాలు ఉన్నాయి. వీటి నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల పన్నుల రాబడి రూ.188.55 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఇప్పటి వరకు రూ.130.82 కోట్లు మాత్రమే వసూలు చేశారు. మిగిలిన రూ.57.73 కోట్లు వచ్చే 14 రోజుల్లో వసూలు చేసేందుకు రోజు వారీ కార్యాచరణతో మున్సిపల్ కమిషనర్లు ముందుకెళ్తున్నారు.

మండలాల వారీగా పన్నుల వసూలు

మండలం	మొత్తం గ్రామాలు	వసూలు శాతం
ఘట్‌కేసర్	11	80.32
మూడు చింతలపల్లి	13	75.22
మేడ్చల్	17	69
కీసర	10	75.43
శామీర్‌పేట	10	72.21

పంచాయతీ శాఖ టార్గెట్ రూ.23.08 కోట్లు..

జిల్లాలో ఐదు మండలాల పరిధిలోని 61 గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నుల ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికి రాబడి రూ.23.08 కోట్లు లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ ఇప్పటి వరకు రూ. 17.18 కోట్లు వసూలు చేశారు. పురపాలక సంఘాల తో పోల్చుకుంటే.. పల్లె ప్రజలు పన్నులు రెగ్యులర్ గా చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన పన్నుల రాబ డి రూ.5.90 కోట్లు ఈ నెలాఖరు కల్లా వసూలు చే సేందుకు పంచాయతీ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. జీపీల్లో మొత్తంగా 74.43 శాతం పన్నులను జిల్లా పంచాయతీ శాఖ వసూలు చేసింది.

బీఆర్ఎస్‌తోనే దేశాభివృద్ధి: మంత్రి మల్లారెడ్డి



మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు

జవహర్‌నగర్: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే దేశాభివృద్ధి జరుగుతుందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు బుధవారం 27వ డివిజన్ కార్పొరేటర్ జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సీహెచ్ జనార్దన్‌రెడ్డి, ఆంజనేయులు, జహంగీర్, కుమార్, చెన్నారెడ్డి, భానుచందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, రమేష్, మహిళలు రీనా, లక్ష్మీ, ఉపేంద్ర, కృష్ణవేణి, కమల, సుభద్ర, విమల, ఉమ తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత

మేడ్చల్: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి మల్లారెడ్డి తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని నూతన్‌కల్‌కు చెందిన పిల్ల నర్సింహకు రూ.19వేలు, అంకుల ప్రమీలకు రూ.30వేలు, మధ్యల శ్రీనుకు రూ.24వేల చొప్పున ఆర్థిక సాయం మంజూరీ కావడంతో ఆ చెక్కులను మంత్రి మల్లారెడ్డి వారికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కవితజీవన్, పీఏసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, నాయకులు యూనిస్ పాషా, ప్రభాకర్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

పోచారం మున్సిపాలిటీలో...

పోచారం: మున్సిపాలిటీలోని లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఎం.స్వర్ణలతకు రూ.30 వేలు, బి.రేణుకకు రూ.12,500, ఇశ్రత్ బేగంకు రూ.25 వేల చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు రాజశేఖర్, వెంకటేశ్ గౌడ్, హరిప్రసాదరావు, రవీందర్, బీఆర్ఎస్ నాయకులు బాలేష్, నల్లవెల్లి శేఖర్ పాల్గొన్నారు.



నూతన్‌కల్‌కు చెందిన లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



పోచారంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి

ఏయూలో 'బ్లాక్ చైన్'పై అవగాహన సదస్సు

ఘట్‌కేసర్: వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా డీఏట, ఐఎస్‌టీఈ అనుసంధానంతో కృత్రిమ విభాగం 'బ్లాక్ చైన్' అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హెచ్‌ఓడీ మల్లికార్జున్‌రెడ్డి, ఉపన్యాసకులుగా భరత్, సౌమ్య, ప్రకాశ్ హాజరై మాట్లాడుతూ.. బ్లాక్ చైన్ ప్రస్తుతం నడుస్తున్న ఆధునిక విజ్ఞానమని, అందులో నిపుణులు కావాలన్నారు. కార్యక్రమంలో సంచాలకులు మాధవి, వంశీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



బ్లాక్ చైన్ సదస్సులో పాల్గొన్న వారితో అతిథులు



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

మేడ్చల్: బీజేవైఎం నాయకులపై వేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం నాయకులు మేడ్చల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రూప్స్ పేపర్ లీకేజీపై న్యాయవిచారణ చేయాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ఎదుట బీజేవైఎం నాయకులు ధర్నాలు చేస్తే నాయకులను అరెస్ట్ చేసి అక్రమంగా కేసులు బనాయించారన్నారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు అర్జున్, వంశీవంజరి, రాఘవరెడ్డి, శ్రీధర్, నాగసాయి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మేడ్చల్: ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. మేడ్చల్‌లో ఇంటర్ పరీక్షల కోసం 5 సెంటర్లు ఏర్పాటు చేయగా విద్యార్థులు ప్రశాతంగా పరీక్షలు రాశారు. నిమిషం ఆలస్యం నిబంధన అమలులో ఉండటంతో ఉదయాన్నే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్ఫూర్తి, గీత, రెడ్ సన్, ఎస్ఎస్ఆర్ కళాశాలల్లో పరీక్షలు జరగగా అన్ని సెంటర్లలో 1901 మంది విద్యార్థులను అలాట్ చేశారు. ఇందులో 1827 మంది పరీక్షలు రాయగా 72 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తుతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల హడావుడి కనిపించింది.

ఘట్‌కేసర్ శ్రీచైతన్య కళాశాలలో...

ఘట్‌కేసర్: ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని రిషి జూనియర్ కళాశాలలో 419 విద్యార్థులను కేటాయించగా 5 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఘట్‌కేసర్ శ్రీచైతన్య కళాశాలలో 454 మంది విద్యార్థులను కేటాయించగా నలుగురు గైర్హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద సీఐ అశోక్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశారు.



ఘట్‌కేసర్ శ్రీచైతన్య కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్ పద్మారెడ్డి, సిబ్బంది



మేడ్చల్‌లో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



ఘట్‌కేసర్ రుషి కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, సిబ్బంది

విస్తరణ పనులు షురూ..

మేడ్చల్‌లో ప్రారంభమైన 44వ జాతీయ రహదారి విస్తరణ పనులు

- రెండు భాగాలుగా విభజించి కాంట్రాక్టర్లకు పనుల అప్పగింత
- ఆస్తులు కోల్పోయే వారికి నష్టపరిహారం ఇచ్చేందుకు ఇప్పటికే సమావేశం నిర్వహణ

మేడ్చల్: ఉమ్మడి మేడ్చల్ మండల పరిధిలో 44వ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఆరు నెలల క్రితం ఈ రహదారి విస్తరణ పనులు నాగ్‌పూర్ వైపు వెళ్లే రహదారికి రెండు భాగాలుగా విభజించి ప్రారంభించింది. గతంలో కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ శంషాబాద్‌లో విస్తరణ పనులకు శంకుస్థాపన చేయడంతో పనులను అధికారులు ప్రారంభించారు. నగరంలోని బోయిన్‌పల్లి నుంచి కొంపల్లి వరకు ఒక భాగంగా, గుండ్లపోచంపల్లి నుంచి మెదక్ జిల్లా కాళ్లకల్ వరకు రెండో భాగంగా విభజించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు.

- నగర శివారు బోయిన్‌పల్లి సమీపం నుంచి కొంపల్లి వరకు సుచిత్ర మీదుగా రెండు నెలలకు ముందుగానే పనులు ప్రారంభమయ్యాయి. తాజాగా గుండ్లపోచంపల్లి బ్రిడ్జి నుంచి మేడ్చల్ వరకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు పనులు మొదలు పెట్టారు.



మేడ్చల్‌లో కొనసాగుతోన్న విస్తరణ పనులు

రోడ్డు విస్తరణ బాధితులకు నష్టం వాటిల్లకుండా...

రోడ్డు విస్తరణ కోసం ఆస్తులు కోల్పోతున్న వారికి నష్ట పరిహారం ఇచ్చేందుకు కీసర ఆర్డీవో నేతృత్వంలో మేడ్చల్‌లో సమావేశం నిర్వహించారు. ఆస్తులు కోల్పోతున్న వారికి నోటీసులు ఇచ్చి వారి నుంచి వ్యక్తమయ్యే అభ్యంతరాలను కలెక్టర్ కార్యాలయంలో స్వీకరించారు. మేడ్చల్ చెక్ పోస్ట్ నుంచి మేడ్చల్ పట్టణం మీదుగా అత్వెల్లి వరకు ఫ్లైవర్ నిర్మించనుండటంతో పెద్దగా ఆస్తులకు నష్టం వాటిల్లడం లేదు. గతంలో సేకరించిన భూమికి అదనంగా 15 మీటర్ల భూమిని విస్తరణలో భాగంగా తీసుకోనున్నారు. 15 మీటర్ల భూమికి ఇరువైపులా సమానంగా కాకుండా అవసరమున్న చోట అవసరం మేరకు ఎక్కువ తక్కువ తీసుకోనుండటంతో పెద్దగా నష్టం వాటిల్లే అవకాశాలు తక్కువయ్యాయి. పట్టణంలో ఆర్టీసీ డిపో సమీపంలో ఒకే వైపు దర్గా, ఏడుగుళ్ల ఆలయం ఉండటంతో ఆ ప్రాంతంలో కొంతమేర ఆస్తులు అధికంగా కోల్పోవాల్సి వస్తోంది. ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఏ ప్రాంతంలో ఎంత మేరకు రోడ్డు విస్తరిస్తారో ఫీట్లలో కొలతలు చేసి మార్కింగ్ చేశారు.



పట్టణంలో రోడ్డు విస్తరణ కోసం చేసిన మార్కింగ్

ప్రారంభమైన విస్తరణ పనులు...

జాతీయ రహదారిని 6 లైన్ల రోడ్డుగా మారుస్తుండటంతో విస్తరణ పనులు మొదలు పెట్టారు. ఇప్పటికే నాలుగు లైన్ల రోడ్డు ఉండటంతో ఇరువైపులా ఒక లైన్ రహదారిని అదనంగా నిర్మిస్తున్నారు. గుండ్లపోచంపల్లి నుంచి కండ్లకోయ రింగ్ రోడ్డు వరకు ఇరువైపులా ఒక్కో లైన్ రోడ్డును వేయడానికి తవ్వకాలు పూర్తి చేసి రోడ్డును నిర్మిస్తున్నారు. మేడ్చల్ చెక్ పోస్టు నుంచి మేడ్చల్ పట్టణం వరకు ఇరువైపులా తవ్వకాలు ప్రారంభించారు. విస్తరణ పనుల వల్ల నిత్యం వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే విస్తరణ పనులు చేసి అదనంగా రోడ్లు నిర్మించి ఫ్లైఓవర్ పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఫ్లైవర్ నిర్మాణం కోసం అధికారులు రహదారిపై భూసార పరీక్షలు పూర్తి చేశారు.

తీరనున్న సమస్య...

మేడ్చల్ నుంచి నగరం వరకు ఉన్న దూరం 30 కిలోమీటర్లు జాతీయ రహదారిపై సాధరణంగా ప్రయాణం చేస్తే 40 నిమిషాల సమయం పడుతుంది. మేడ్చల్ వరకు విపరీతంగా అభివృద్ధి చెందడం, వెంచర్లు, కంపెనీలు విరివిగా ఉండటం, జాతీయ రహదారిపై వాహనాల సంఖ్య పెరగడం, రింగు రోడ్డు మీదుగా వెళ్లే వాహనాల సంఖ్య పెరగడటంతో ప్రయాణ సమయం గంట నుంచి గంటన్నర పడుతుంది. మేడ్చల్‌లో సాయంత్రం వేళల్లో నిత్యం గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుంది. దీంతో వాహనదారులకు నిత్యం సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. నాలుగు లైన్ల రహదారి ఆరు లైన్ల రహదారిగా మారడం, ఫ్లైఓవర్ల నిర్మాణం, సర్వీసు రోడ్డుల నిర్మాణం పూర్తయితే మేడ్చల్ నుంచి నగరంకు అర గంటలో చేరవచ్చు. ఎలాంటి ఆటంకాలు లేకుండా కాంట్రాక్టర్‌కు ఇచ్చిన గడువులోపు పనులు పూర్తయితే త్వరలోనే మేడ్చల్ వాసులు సమస్యల నుంచి బయట పడవచ్చు.



మల్కారంలో వెలిసిన గుడిసెలు



ప్లకార్డులతో ప్రదర్శన చేస్తున్న గుడిసెలు వాసులు

వేసేయ్ పాక.. కొట్టేయ్ జాగ

- జవహర్‌నగర్‌లోని మల్కారంలో అక్రమంగా వెలిసిన గుడిసెలను తొలగించిన అధికారులు
- బాధితుల ఆందోళన

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లోని హుడా భూముల్లో బుధవారం అకస్మాత్తుగా గుడిసెలు వెలిసాయి. దాదాపు రెండు వందల మంది సర్వే నెం.26లో వంద గుడిసెల వరకు వేశారు. దీంతో జవహర్‌నగర్‌లో ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున చేరుకుని కేటీఆర్ నగర్ పేరుతో బీఆర్ఎస్ జెండాలు పెట్టుకుని గుడిసెలు వేశారు. ప్రత్యేక తెలంగాణ వచ్చినా ఇప్పటికీ అద్దె ఇళ్లలో జీవిస్తున్నామని చాలీచాలని జీతాలతో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్నామని వాపోయారు. ఎన్నోసార్లు తమకు ఇండ్లు కేటాయించాలని ఎనిమిదేళ్లుగా వినతిపత్రాలు, పోరాటాలు చేసినా ప్రభుత్వం కనికరించడంలేదని మాకు గూడు కల్పించే వరకు పోరాడుతామని ఆవేదన వ్యక్తం చేశారు.

తెల్లవారుజామునే వెలసిన గుడిసెలు..

జవహర్‌నగర్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు జవహర్‌నగర్‌లోని మల్కారం సర్వే నంబర్ 26లో పెద్ద ఎత్తున గుడిసెలను ఏర్పాటు చేశారు. ఆ స్థలం వద్ద బీఆర్ఎస్ జెండాలతో పాటు కేటీఆర్ నగర్ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుడిసెలు వేసిన పలువురు మహిళలు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ వస్తే మా బతుకులు మారుతాయని ఎంతగానో ఆశపడ్డామని, కూలీ పనులు చేసుకునే మాకు సొంత గూడులేక నరకయాతన పడుతున్నామన్నారు. ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయిస్తుందని ఎనిమిదేళ్లుగా ఎంతో ఆశగా ఎదురు చూశామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోవడంతో బుధవారం తెల్లవారుజామున గుడిసెలు వేశామన్నారు.



గుడిసెవాసులను సముదాయిస్తున్న పోలీసులు



కేటీఆర్ నగర్ పేరుతో వెలిసిన గుడిసెలు

జవహర్‌నగర్‌లో ఉద్రిక్తత...

బుధవారం తెల్లవారుజామున వందాలది మంది జవహర్‌నగర్‌తో పాటు నగర శివారు ప్రాంతాల నుంచి వందలాది మంది చేరుకుని మల్కారంలోని సర్వే నంబర్ 26లో గల 10 ఎకరాల్లో ఒక్కసారిగా వందాలాది గుడిసెలు వేశారు. దీంతో ఘటనా స్థలానికి రెవెన్యూ, హుడా, జవహర్‌నగర్ పోలీసులు చేరుకోవడంతో ఉద్రిక్తత చేటు చేసుకుంది. ఇది ప్రభుత్వ భూమి ఇక్కడ ఎలాంటి గుడిసెలు వేయొద్దని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డీఐ మధుకుమార్, ఎస్ఐలు నాగరాజు, అనిల్‌కుమార్‌లు గుడిసెవాసులకు విన్నవించి అనంతరం గుడిసెలను తొలగించారు.

> **కఠినంగా వ్యవహరిస్తాం**
>
> ప్రభుత్వ భూములలో రాత్రికి రాత్రే గుడిసెలు వేస్తే సహించేది లేదు. దీనికి సంబంధించిన బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తాం. గుడిసెల ప్రాంతాన్ని అన్ని కోణాల్లో పరిశీలించాం. ఈ విషయంలో కొందరిని గుర్తించి కేసులు నమోదు చేయడం జరిగింది. ప్రభుత్వ భూములలో ఇలాంటి నిర్మాణాలకు ఎవరైనా ప్రోత్సహిస్తే వారిపైనా కఠినంగా వ్యవహరిస్తాం.
>
> – జానకీ, డీసీపీ, మల్కాజిగిరి

> **కిరాయి ఇళ్లలో ఉండలేకపోతున్నాం..: బాధితులు**
>
> కూలీ పనులు చేసుకుని బతికేటోళ్లం. మాకు ప్రభు త్వం డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించలేదు. కనీ సం మాకు ప్రభుత్వ స్థలంలోనైనా గుడిసెలు వేసుకునేందుకు అవకాశం కల్పించండి అని అధికారులను పలువురు మహిళలు వేడుకున్నారు. ప్రభుత్వం స్థ లం ఉంటే డబ్బులిచ్చి ఇండ్లు కట్టిస్తామంటున్న ప్ర భుత్వం మాకు న్యాయం చేయాలి. అప్పటి వరకు మా పోరాటాన్ని ఆపేదిలేదు. పోలీసులతో కేసులు పెట్టి బయపెట్టాలని ప్రయత్నిస్తే తప్పకుండా ప్రతిఘటిస్తాం.